


epaper. aksharakalam. com

# అక్షర కలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 158 | 01-09-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## జాతీయ జెండాకు అవమానంపై మూల్యం తప్పదు

న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. 'ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము.



## భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని అనుమా నాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు.



## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ



వార్త 2లో

### తాము యుద్ధాన్ని కోరుకోవట్లేదు

### 'చర్చల ద్వారా సమస్యను పరిష్కరించు కోవడానికి మేం సిద్ధం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ప్రధాని నరేంద్ర మోదీఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు కిర్గిస్థాన్‌లో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడిని కలవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సమావేశంలో యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వంటి కీలక అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే లక్ష్యంతో చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని మోదీ హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇరుదేశాల మధ్య వాణిజ్య పరిధిని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. తమ దేశం పై అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు పెజెష్కియన్ ఈ సదస్సుకు హాజరయ్యారు.



## ప్రశ్నార్థకంగా ఆడబిడ్డల భద్రత

### తుక్కుగూడ ఘటనే ఇందుకు నిదర్శనం

### మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.

2




2

## వచ్చే మార్చి నాటికి లక్ష ఉద్యోగాల భర్తీ

### రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి

వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రకటించారు. అలాగే వారానికి ఒక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిరుద్యోగులకు వరుసగా అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

మానుకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ శిబిరంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే డిసెంబర్‌లో మరోసారి పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీని మూడు విడతల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించడంలో వెనుకంజలో ఉందని వ్యాఖ్యానించారు.

## ఏ ప్రభుత్వమైనా టైటిల్ మారింది తప్ప.. దోపిడీ విధానాలు మారలేదు: టీబీజేపీ చీఫ్



2

భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది.

## భూభారతి తెచ్చి రైతుల కష్టాలు పరిష్కరించాం: పొంగులేటి

గతంలో ప్రజలను పట్టించుకోని నేతలు.. తమకు నీతులు చెబుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో రెవెన్యూ మంత్రి ఏనాడైనా ప్రజలను కలిసారా అని ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు పొంగులేటి శంకుస్థాపన చేశారు. కేసముద్రంలో బహిరంగ సభలో మంత్రులు సీతక్క, పొంగులేటి పాల్గొన్నారు.

2





## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్

2




## పెట్రోల్‌లో ఇథనాల్ శాతం వెల్లడించాలని పిటిషన్.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..

పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఎంత శాతం ఇథనాల్ ఉందో తప్పనిసరిగా వెల్లడించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు స్వీకరించలేదు.

# వెయ్యి రోజుల పాలనలో తెలంగాణలో సంస్కరణల జోరు

## ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో ముందుకు..

### రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్షర కలం, సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 : తెలంగాణలో మా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే అనేక అభివృద్ధి, సంస్కరణ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2023 డిసెంబర్ 3న ప్రజలు మాకు పట్టం కట్టారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.12,075 కోట్ల విలువైన ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 580 మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టామని, మహిళా సంఘాలను ఆర్టీసీ బస్సుల నిర్వహణలో భాగస్వాములను చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వాహన సారథి, ఈవీ, స్క్రాప్ పాలసీలతో పాటు చెక్‌పోస్టుల రద్దు వంటి సంస్కరణలతో రవాణా శాఖను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖలో గురుకులాలు, హాస్టళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కోహెడ, తంగళ్లపల్లి వంటి ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణం చేపడుతున్నామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కోసం సుమారు రూ.20 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.35 వేల కోట్లు వెచ్చించినట్లు వివరించారు. వెయ్యి రోజుల పాలనలో సుమారు 72 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు అందించామని తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ అందించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, నియోజకవర్గానికి 5,500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం అనే ఐదు ప్రధాన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఆదాయ మార్గాలను పెంచుకుంటూ మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**గౌరవెల్లి కాలువలు త్వరగా పూర్తి చేసి నీళ్లిస్తాం**

గౌరవేల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, రైతుల సహకారంతో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలను త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నమన్న పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులు చేపడతామని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో పరిశ్రమలు, ఎంటర్‌టైన్‌మెంట్, పర్యాటక రంగాల అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు. ఎల్లమ్మచెరువు వద్ద అర్బన్ ఫారెస్ట్, విద్యారంగంలో యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ కాలేజీ, వైద్య రంగంలో 200 పడకల ఆస్పత్రి, పీజీ కాలేజీ వంటి ప్రాజెక్టులను తీసుకువస్తున్నామని చెప్పారు. కరీంనగర్, అక్కన్నపేట వైపు నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధితో పాటు అక్కన్నపేట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఎకరం భూమి కూడా బీడుగా ఉండకూడదన్నదే తన లక్ష్యమన్నారు. రైతులు పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులకు శాంక్షన్లు తీసుకొచ్చి, వాటిని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రి, ఇంజనీరింగ్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ కాలేజీ, నాలుగు లైన్ల రహదారులు, అర్బన్ ఫారెస్ట్, ఎల్లమ్మచెరువు తదితర పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, మిగిలిన పనులను కూడా వేగవంతం చేసి త్వరగా పూర్తి చేస్తామని అన్నారు.

## పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**-ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే మేమే ఆక్రమించి ఇండ్లు నిర్మిస్తాం**

**-సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.జయరాజు**

**అక్షర కలం, అందోలు ప్రతినిధి:**

పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే మేమే ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇండ్లు నిర్మిస్తామని సిపిఎం పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి. జయరాజు అన్నారు. సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో అనేక సంవత్సరాల నుండి అద్దె ఇంట్లో ఉంటున్న పేద ప్రజలకు ప్రభుత్వాలు నమ్మక ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు.



టిఆర్ఎస్ ప్రభుత్వంలో గత పది సంవత్సరాల నుండి నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేసిందన్నారు. రెండు ప్రభుత్వాలు పేదలకు మోసం చేసిన ప్రభుత్వాలే అని ఆయన ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిజమైన లబ్ధిదారులకు ఇంద్రమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ భూములు గుర్తించి మేమే ప్రజలను ఐక్యం చేసి భూములను ఆక్రమించి ఇల్లు నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు.

పేదలందరికీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మిస్తామన్న ఇందిరమ్మ ఇండ్లు వెంటనే నిర్మించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సంగారెడ్డి కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో పేదలు అద్దెలు కట్టలేక అవస్థలుపడుతున్నారని తెలిపారు. పేదలకు కేరళ రాష్టం మాదిరి రేషన్ షాప్ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్యం ఫ్రీగా అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, మందులు, కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పేదలు నివసించే కాలనీలలో డ్రైనేజీ, రోడ్లు, వీదిలైట్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటం నిర్వహిస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సంగారెడ్డి మండల కార్యదర్శి పి.అశోక్, నాయకులు పెంటయ్య, ముత్యాలు, నాగరాజు, పాల్గొన్నారు.

## రైల్వే హబ్ గా గద్వాల జిల్లా అభివృద్ధి.

**గద్వాలలో మరో ఆర్ఓబి నిర్మాణానికి రూ.66 కోట్ల నిధులు.**

**అమృత్ భారత్ పథకం రూ.42.82 కోట్ల నిధులతో గద్వాల స్టేషన్ అభివృద్ధి.**

**శరవేగంగా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు.**

**గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కృషి.**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి.**

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**



అమృత్ భారత్ పథకం ద్వారా మంజూరైన రూ.42.82 కోట్ల నిధులతో గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం గద్వాల స్టేషన్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర మంత్రి పరిశీలించారు. స్టేషన్ కు చేరుకున్న అతిథులకు అధికారులు, పలువురు నేతలు మేళ తాళాలతో, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా స్టేషన్ అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్లాట్ ఫామ్ పై తిరుగుతూ తుంగభద్ర ఎక్స్ప్రెస్ రైల్లోనీ ప్రయాణికులకు అభివాదం చేశారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న వివిధ పనులను గమనించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల రైల్వే స్టేషన్ లో అమృత్ భారత్ పథకం పనులు పూర్తయితే ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రైళ్లకు అదనంగా ఇతర రైళ్ల స్టాపింగ్ కు కృషి చేస్తానన్నారు. స్టేషన్లో ప్లాట్ఫార్మ్ విస్తరణ, పార్కింగ్ అభివృద్ధి, నూతన పరిపాలన భవనం, గద్వాల సంస్థానం సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా ముఖద్వారా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్టేషన్ వెనుక వైపు నుంచి కూడా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులకు సౌకర్యంగా మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైల్వే హబ్ గా జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి చెందుతుందనటంలో అతిశయోక్తి లేదన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ ప్రారంభమై వందేళ్లు దాటడంతో అమృత్ భారత్ పనులు పూర్తయ్యాక జిల్లా ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైల్వేకు సంబంధించి గడిచిన 10 ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులను ప్రయాణికులకు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వాలు ఏడాదికి రూ.886 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2025-2026 సంవత్సరానికి రూ.5454 కోట్ల నిధులను ఒక్క తెలంగాణకే కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2009-2014 సంవత్సరాల మధ్యన కేవలం 87 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు జరిగితే ప్రస్తుతం 888 కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టడం గర్వకారణమన్నారు. 21 రైల్వే ప్రాజెక్టులకు రూ.50 వేల కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో 520 ఆర్ఓబి, ఆర్యుబి నిర్మాణాలను పూర్తి చేసామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4883 కోట్ల నిధులతో 118 రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు చేస్తున్నామన్నారు. గద్వాలలో రూ.66 కోట్ల నిధులతో మరో ఆర్ఓబి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో 99 శాతం రైల్వే ట్రాక్స్ ను విద్యుద్దీకరించడం జరిగిందని, 100 కొత్త రైళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 174 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఉచితంగా హై స్పీడ్ వైఫై సౌకర్యాన్ని కల్పించామన్నారు. కాజీపేటలో నూతన సాంకేతికతను వినియోగించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా రైళ్ల బోగీల తయారీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. రైల్వే ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోందని, దేశవ్యాప్తంగా కవచ్ టెక్నాలజీనీ అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ఏడు బుల్లెట్ రైళ్లను ప్రకటిస్తే అందులో తెలంగాణ రాష్ట్రానికే మూడింటిని కేటాయించడం గర్వకారణంగా ఉందన్నారు. వీటిని హైదరాబాదు నుంచి పూణే, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడపడంతో రాష్ట్రం గేమ్ చేంజర్ గా మారుతుందని చెప్పారు. హై స్పీడ్ రైల్ ఎలివేటెడ్ క్యారిడార్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, దాంతో వివిధ ప్రాంతాలకు తక్కువ సమయంలోనే ప్రయాణికులు రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుందని ఫలితంగా హైదరాబాద్ కు ప్రపంచవ్యాప్త పెట్టుబడులు పెరుగుతాయని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందని, ఫలితంగా భక్తుల సంఖ్య కూడా పెరగడంతో క్షేత్ర విశిష్టత ఇనుమడిస్తుందన్నారు. విమానాశ్రయాలను తలపించేలా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వందేళ్లు పూర్తి చేసుకున్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే అన్ని రైళ్లు ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గద్వాల - డోర్నకల్, మాచర్ల - గద్వాల రైల్వే లైన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. డబ్లింగ్ పనులు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల సంస్థానాధీశులు ఇక్కడ రైల్వే స్టేషన్ నిర్మాణానికి 100 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించడంతో మిగిలిన స్థలంలో భవిష్యత్తులో రైల్వే ప్రాజెక్టులను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గద్వాల పేరు చెప్పగానే మొదట ఇక్కడి చేనేత జరీ చీరలు గుర్తొస్తాయని, రైల్వే కనెక్టివిటీ సౌకర్యాలు మెరుగుపడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మరింత అభివృద్ధి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.




## తెలంగాణ రాష్టం శాసన సభ అంచనాల కమిటి చైర్మెన్ గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య భాధ్యతలు స్వీకరణ.




**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**

తెలంగాణ రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ చైర్మెన్ గా రాష్ట శాసన సభ కార్యాలయం లో ఆదివారం ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య భాధ్యతలు స్వీకరించారు. ప్రజా అవసరాలు రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వ నిధుల సద్వినియోగమే లక్ష్యమని ఇల్లందు శాసనసభ్యులు కూర అన్నారు. అనంతరం ఇల్లందు ఎమ్మెల్యే ం కనకయ్య అధ్యక్షతన సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ హాజరై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు,వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ అంచనాలు,వ్యయాలపై సమగ్రంగా చర్చించి, ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో అంచనాల కమిటి సభ్యులు, సహచర ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, సుదీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యదవ రెడ్డి, శాసన సభ, శాసన మండలి ప్రధాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లక్కీడ్రా పై సమగ్ర విచారణ జరపాలి



**మందమర్రి, ఆగస్టు 31 అక్షర కలం:**

మండలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల కోసం నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్ కుమార్ లు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సొసైటీ ఆధ్వర్యంలో ప్రజావాణి నోడల్ అధికారి, మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుద్దాల ప్రభుదేవ్, నందిపాట రాజ్ కుమార్ లు మాట్లాడుతూ, లక్కీ డ్రా ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. మొదట విడుదల చేసిన జాబితాలో 447 ఇళ్లకు సంబంధించిన వివరాలు ఉండగా ఒక్కరోజులోనే అర్హుల సంఖ్య 491కి పెరగడంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారో బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారు, సింగరేణిలో రిటైర్ అయి క్వార్టర్లలో ఉంటున్న కొందరు సైతం లబ్ధిదారుల జాబితాలో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై పూర్తి విచారణ లేకుండానే లక్కీ డ్రా నిర్వహించారని అన్నారు. లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 307 మందిలో కేటగిరీల వారీగా ఎంతమందికి ఇళ్లు కేటాయించారో శ్వేతపత్రం రూపంలో వెల్లడించాలని, అర్హుల జాబితాను పునఃపరిశీలించి, అనర్హులు ఉంటే రద్దు చేసి, నిజమైన అర్హులైన పేదలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పృథ్వి, రఫీ, జావిద్, డబుల్ బెడ్రూమ్ బాధితులు, స్థానికులు పాల్గొన్నారు.

## అక్రమ ఫాంహౌస్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి

**మందమర్రి, ఆగస్టు 31 అక్షర కలం:**

మందమర్రి శివారులోని సర్వే నెంబర్ 347/2లో 3 ఎకరాల 20 గుంటల సీలింగ్ భూమిలో కొనసాగుతున్న అక్రమ ఫాంహౌస్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని, అర్హులైన పేద ప్రజలకు పంపిణీ చేయాలని తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నోడల్ అధికారి మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, సీలింగ్ భూమి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు నిర్మాణం చేపట్టడం చట్టవిరుద్ధమని, ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు పేద ప్రజల సంక్షేమం కోసం ఉపయోగపడాల్సి ఉండగా వాటిపై ప్రైవేటు నిర్మాణాలు కొనసాగడం పట్ల తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ భూమికి



సంబంధించి 1/70 చట్టం, ఇతర సంబంధిత చట్ట నిబంధనలు వర్తించే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఫాంహౌస్ నిర్మాణానికి మున్సిపల్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల నుంచి ఎలాంటి అనుమతులు ఉన్నాయో పరిశీలించాలని, అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంటే వెంటనే నిర్మాణ పనులను నిలిపివేసి, అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. సీలింగ్ భూమిని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హులైన పేద, భూమిలేని ప్రజలకు పంపిణీ చేయాలని, ఈ వ్యవహారంలో అక్రమ నిర్మాణానికి సహకరించిన వ్యక్తులు లేదా విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన అధికారులు ఎవరైనా ఉంటే వారిపై సైతం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, ఐటిడిఏ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి తక్షణమే స్థల పరిశీలన, సమగ్ర విచారణ నిర్వహించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకొని, సీలింగ్ భూమిని పేద ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !

**నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే.  ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.**

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.   నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు



వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి  చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి ప్రక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

### లక్కీ డ్రాను రద్దు చేసి, బీసీ రిజర్వేషన్లతో మళ్లీ నిర్వహించాలి

మందమర్రి, ఆగస్టు 31 అక్షర కలం:

పట్టణంలో ఇటీవల నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి నోడల్ అధికారి మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ, ఇటీవల పట్టణంలో జిల్లా కలెక్టర్, మండల తహశీల్దార్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో



వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్ల ప్రకారం డ్రా నిర్వహించిన అధికారులు బీసీలకు మాత్రం ఎలాంటి రిజర్వేషన్ లు కల్పించకుండా జనరల్ కేటగిరీలో లక్కీ డ్రా నిర్వహించడం తగదని అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటాను కేటాయించకుండా జనరల్ కేటగిరీలో చేర్చి లక్కీ డ్రా నిర్వహించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని గత కొన్నేళ్లుగా ఉద్యమాలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. బీసీలకు రావాల్సిన వాటా దక్కకుండా రిజర్వేషన్ల అమలులో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అమల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లను సైతం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించలేని పక్షంలో కనీసం ప్రస్తుతం అమల్లో ఉన్న బీసీ రిజర్వేషన్ కోటాను వర్తింపజేసి, గతంలో నిర్వహించిన లక్కీ డ్రాను పునఃపరిశీలించి, బీసీ రిజర్వేషన్లతో మరోసారి లక్కీ డ్రా నిర్వహించాలని కోరారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కొండిల్ల శ్రీనివాస్ ముదిరాజ్, నలువల సమ్మయ్య యాదవ్, మడ్డి వేణుగోపాల్ గౌడ్, యోగానంద రావు, మహారాజు సంపత్ లు పాల్గొన్నారు.

## భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో ఐజీ వార్షిక తనిఖీ

### కేసుల దర్యాప్తు వేగం పెంచాలి.. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

### మల్టీజోన్--2 ఐజీ షానవాజ్ ఖాసిం ఆదేశం

మహబూబ్ నగర్. భూత్పూర్, ఆగస్టు 31. అక్షర కలం: నేరాల నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారం, కేసుల దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని మల్టీజోన్--2 ఐజీ షానవాజ్ ఖాసిం, ఐపీఎస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, పోలీసు సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.



తనిఖీలో భాగంగా కార్యాలయంలో నిర్వహించాల్సిన ముఖ్యమైన రికార్డులు, రిజిస్టర్లు, కేసు డైరీలు, నేరాల రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు కేసులు, వారెంట్లు, ఆన్‌లైన్ రికార్డులు తదితర పోలీసు సంబంధిత పత్రాల నిర్వహణను ఐజీ పరిశీలించారు.

సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తు నాణ్యత, నేరస్థులపై నిఘా, రౌడీషీటర్ల పర్యవేక్షణ, వారెంట్ల అమలు, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, మహిళలు, బాలల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని పోలీస్ స్టేషన్లను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బందికి సరైన మార్గనిర్దేశం చేస్తూ కేసుల దర్యాప్తును నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగ్ కేసులను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కేసుల దర్యాప్తులో సాక్ష్యాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, దర్యాప్తు వేగవంతంగా, నాణ్యతతో సాగాలని ఐజీ పేర్కొన్నారు. కోర్టు విచారణలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా పనిచేసే విధంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు ఫిర్యాదులపై సత్వర స్పందన ఉండాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో పాటు వారి సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పలు సూచనలు చేశారు.

ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, భూత్పూర్ సర్కిల్ పరిధిలోని సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినుల భద్రతపై రాజీ లేదు

### మహమ్మదాబాద్ కేజీబీవీని సందర్శించిన జిల్లా విద్యాధికారి విజయకుమారి

మహమ్మదాబాద్ .ఆగస్టు .31 అక్షర కలం : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని జిల్లా విద్యాధికారి విజయకుమారి స్పష్టం చేశారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని ఆమె సోమవారం సందర్శించి విద్యార్థినుల పరిస్థితులను పరిశీలించారు.

వివిధ పత్రికల్లో కేజీబీవీ విద్యార్థినుల భద్రతకు సంబంధించిన అంశాలు వెలువడిన నేపథ్యంలో జిల్లా విద్యాధికారి స్వయంగా విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో మాట్లాడారు. ఆదివారం పాఠశాలలో జరిగినట్లు ప్రచారం జరిగిన ఘటనపై



విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం కేజీబీవీ సిబ్బందితో సమావేశమై పత్రికల్లో వచ్చిన అంశాలపై చర్చించారు. విద్యార్థినులు ఆదివారం పాఠశాల గోడ దూకి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారంటూ వచ్చిన వార్తలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టారు. స్థానిక మండల విద్యాధికారి రాజు నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి అశ్రకాద్రితో కలిసి విద్యాలయంలోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించారు.

పరిశీలనలో కేజీబీవీకి చెందిన ఏ ఒక్క విద్యార్థిని కూడా పాఠశాల గోడ దూకినట్లు గానీ, పారిపోయేందుకు ప్రయత్నించినట్లు గానీ నిఘా కెమెరాల దృశ్యాల్లో కనిపించలేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయినప్పటికీ ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదికను అందించాలని మండల విద్యాధికారి, ప్రత్యేక అధికారిని జిల్లా విద్యాధికారి ఆదేశించారు.

అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో ఏవైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ, కేజీబీవీ విద్యార్థినుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రతి నెల రెండో ఆదివారం మాత్రమే తమ పిల్లలను చూసేందుకు కేజీబీవీకి రావాలని సూచించారు. మిగతా రోజుల్లో పాఠశాల సందర్శనకు రాకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు.

మండల విద్యాధికారి రాజు నాయక్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు కేజీబీవీ విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. పత్రికల్లో వచ్చిన అన్ని అంశాలపై ప్రత్యేక అధికారి అశ్రకాద్రితో కలిసి సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. పూర్తి నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించినట్లు తెలిపారు.

## చట్టాలపై అవగాహన కల్పించిన: పోలీసు, రెవిన్యూ అధికారులు.

నారాయణపేట, సెప్టెంబర్, 01, (అక్షర కలం)

పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినిత్ ఆదేశాల మేరకు
ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో  పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.  కొన్ని



సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు.  కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో  పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి  చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన  కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు.  పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యశీగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ పాల్గొన్నారు.

## విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి

అక్షర కలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31:
ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను డిసిపి ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, సింగరేణి సంస్థ అధికారులు బుద్ధ ప్రకాష్, రాధాకృష్ణ, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్య చంద్ర దాస్,  కాంతయ్య దాస్, వ్యవసాయ కమిటీ చైర్మన్ భానేష్, కార్పొరేటర్లు చిలువేరు జ్యోతి, శేరు శ్రీలక్ష్మి లతో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం పద్మనాయక ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టి, విద్యార్థులకు అల్పాహారం అందించి ఏకాగ్రతతో విద్యను అభ్యసించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని, ప్రీ ప్రైమరీ పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ 8 కోట్ల రూపాయల సిఎంఆర్ నిధులను అందించడం అభినందనీయమని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ విద్యా సంవత్సరం 7 శాతం విద్యార్థుల నమోదు పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల నుండి దాదాపు 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరారని, వచ్చే విద్యా సంవత్సరంలో మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, కొడంగల్, మధిర, మంథని తరువాత మంచిర్యాలలో సెంట్రలైజ్డ్  కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కిచెన్ నిర్వహణ బాధ్యతలు చేపట్టి జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 42 వేల 450 మంది విద్యార్థులకు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 6 వేల 654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా కిచెన్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన సుమారు 12 వేల చదరపు అడుగుల షెడ్‌లో ఈ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం జరిగిందని, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఆటోమేటిక్ వెజిటబుల్ వాషింగ్ అండ్ కటింగ్ యూనిట్ వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి, కాసిపేట, నెన్నెల, హాజీపూర్, నాస్పూర్, భీమారం మండలాలు, జగిత్యాల జిల్లాలోని వెల్లటూరు, ఎండపల్లి మండలాలు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా విద్యను అభ్యసించేలా చేయడం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యమని తెలిపారు.  విద్యార్థుల నమోదులో మంచిర్యాల రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందని ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1–0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది.ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది.

# అఫ్గాన్‌తో టి20 సిరీస్ కు అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరపున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరపున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరపున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.




# రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు.

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.



# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఫిర్యాదుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక జిల్లా ..కలెక్టర్ చంద్రశేఖర్

**అధికారులతో ప్రతి వారం ప్రత్యేక సమీక్షా సమావేశాలు**

**మూడు రోజుల్లో విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశం**

**త్వరలో జిల్లాలో సీఎం పర్యటన**

**రీసర్వే గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను డీమార్క్ చేయాలని స్పష్టీకరణ**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**



ఇకపై ప్రజావాణి దరఖాస్తుల తో పాటు, వివిధ పథకాల అమలుపై మండల ప్రత్యేక అధికారులతో ప్రతి సోమవారం లేదా మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. సమావేశం అనంతరం ఎంఎస్ ఓ లు మండల స్థాయిలో తహసిల్దార్, ఎంపీడీవో, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్ తదితరులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వారాంతంలోగా నివేదిక సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా, మండల, డివిజన్ సాయి ప్రజావాణిలలో వచ్చే ఫిర్యాదులపై ఇకపై ప్రత్యేకంగా సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... పింఛన్లకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని, ఒకవేళ ఎవరైనా ఆన్లైన్ చేయకుండా భౌతికంగా దరఖాస్తులు ఇచ్చినట్లయితే వెంటనే ఆన్లైన్ చేయించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల్లో జిల్లాలోని అన్ని మండలాలలో పాఠశాల విద్యార్థులకు యూనిఫార్మ్ పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ఇద్దరు టైలర్లు, రెండు మిషన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు దుస్తులు సరిపోనట్లయితే ఆల్ట్రేషన్ చేయించి ఇవ్వాలని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికలను సిపిఓ కు సమర్పించాలని, అంతేకాక జిల్లా నివేదికతో పాటు, నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించిన నివేదికను ప్రత్యేకంగా రూపొందించి సమర్పించాలని, ఆయా శాఖల అధికారులు ఎప్పటిలాగే వారి శాఖల ద్వారా చేసే ఏర్పాట్లను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని అన్నారు. జిల్లాలో రీసర్వే నిర్వహిస్తున్న గ్రామాలలో అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సంస్థలు, భూములు, ఆస్తులను డీమార్కు చేయించుకోవాలని, ఇది ఆయా శాఖల బాధ్యత అని అన్నారు. సెప్టెంబర్ 1న దేవరకొండలో యు డి ఐ డి కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాత్రు నాయక్ ను ఆదేశించారు. ప్రముఖులు, వివిఐపి ల ద్వారా వచ్చే లేఖలు, అలాగే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటిని పరిష్కరించాలని, పరిష్కరించిన విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధితో పాటు, దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్ చెప్పారు. కాగా ఈ సోమవారం జిల్లాస్థాయి ప్రజావాణిలో రెవెన్యూ శాఖ కు 44, ఇతర శాఖలకు 39 దరఖాస్తులు మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ సర్వీస్ నుండి పదవి విరమణ పొందుతున్న జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ సేవలను జిల్లా కలెక్టర్ కొనియాడారు.
రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## నూతన పెన్షన్ల దరఖాస్తు గడువు పొడిగించాలి -- సీపీఎం డిమాండ్



**అక్షరకలం బిబినగర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆసరా/చేయూత పథకం కింద నూతన పెన్షన్ల దరఖాస్తు గడువును మరో 15 రోజులు పొడిగించాలని సీపీఎం బీబీనగర్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో సూపరింటెండెంట్ అంబటి శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల ఒత్తిడి, కుల-ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యల వల్ల చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కావున ప్రభుత్వం గడువు పొడిగించడంతో పాటు, ఆరు గ్యారంటీల హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు రూ. 4,000 పెన్షన్ అందించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, సీపీఎం నాయకులు పంజాల జంగయ్య, చెట్టబోయిన కనకయ్య, కుంట్ల యాదిరెడ్డి, అంగడి సోమయ్య, పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి




**చిట్యాల : ఆగస్టు 31 (అక్షర కలం )**

విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాల మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు ఆరూరి ప్రణీత్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాల ఫీజులు చెల్లించలేక పలువురు విద్యార్థులు చదువును కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చిట్యాల మండల కన్వీనర్ చందు, కో-కన్వీనర్ యశ్వంత్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూలు

**అక్షరకలం దేవరకొండ,**



దేవరకొండ డివిజన్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు (మౌఖిక పరీక్ష) నిర్వహిస్తున్నట్లు సీడీపీవో చంద్రకళ తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఎస్సెస్సీ/ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకుని ఇంటర్వ్యూకి హాజరు కావాలని సీడీపీవో సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేని వారిని ఇంటర్వ్యూకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

## బహుజన వీరుడు, “పండగ సాయన్న”

**--విగ్రహ ప్రతిష్టాపనకు అనువైన స్థలం కేటాయించాలి**

**--తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్**

**అక్షరకలం నల్గొండ**

నిరుపేదల రక్షణ కోసం, అన్యాయాలపై పోరాడి బహు జనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు తెలంగాణ రాబిన్ హుడ్ అయినటు పండగ సాయన్న ముదిరాజ్, జయంతి, వర్ధంతులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీవో ఎంఎస్ నెంబర్ 84/ పిఎస్ సీఎం/2026 ప్రకటించడాన్ని యావత్ తెలంగాణ ముదిరాజ్ సమాజం హర్షిస్తుంది. అందులో భాగంగా నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ నుండి హైదరాబాద్ బైపాస్, నల్గొండ బస్టాండ్ నుండి క్లాక్ టవర్ వరకు ఈ యొక్క మహనీయుని విగ్రహాన్ని స్థాపించడానికి స్థలం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నల్లగొండ జిల్లా పక్షాన కలెక్టర్ ను కోరడం జరిగిందని తెలిపారు. అందుకు వారు స్పందిస్తూ అనువైన స్థలం సూచించేందుకు సుముకత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన రాష్ట్ర అధ్యక్షులు బొమ్మరబోయిన రాజు ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ ముదిరాజ్, చెన మోని రాములు ముదిరాజ్, దుడ్డు కృష్ణమూర్తి ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, పిట్టల నాగన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# పార్టీలకతీతంగా ‘నగర ‘ ప్రగతి

**--నల్లగొండ కార్పొరేషన్ అభివృద్ధియే ధ్యేయం**

**-- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ?రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితమని, ఎన్నికల అనంతరం పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిపూర్ణ సహకారంతో నల్లగొండ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. తన దృష్టిలో అన్ని డివిజన్లు సమానమేనని, ఏ ఒక్క డివిజన్‌పై కూడా ఎలాంటి వివక్షత చూపబోనని తేల్చిచెప్పారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతిరోజు ఒక వార్డులో పర్యటిస్తానని, అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో మిగిలిపోయిన సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను కోట్ల రూపాయల వ్యయంతో వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డివిజన్లలో ఎలాంటి ప్రజా సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికిగానీ, కార్పొరేషన్ సమావేశాల దృష్టికిగానీ తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని కార్పొరేటర్లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డివిజన్ కార్పొరేటర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# భూ రికార్డుల నమోదులో పొరపాట్లకు తావుండొద్దు: -- కలెక్టర్ చంద్రశేఖర్

**రీ-సర్వే, అసైన్డ్ భూములపై రోజూ ప్రత్యేక దృష్టి సారించాలి**

**22ఏ నిబంధనల అమలుపై రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





భూభారతి, అసైన్డ్ భూములు, ఎస్ఐఆర్, రీ-సర్వే పనులపై అధికారులు ప్రతిరోజూ ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్తగా పని చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 22ఏకు సంబంధించిన నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలని కలెక్టర్ చెప్పారు. అసైన్డ్ భూములు, సీలింగ్ భూములు, అటవీ భూములు, ప్రభుత్వ భూములు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలను నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ ల్యాండ్స్, గ్రామకంఠం భూములు, ఇనాం భూములు తదితర భూములను సర్వే చేసి పూర్తి సమాచారం సేకరించాలని తెలిపారు. భూములకు సంబంధించిన రికార్డులను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రీ-సర్వే పనులు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, భూముల వివరాల నమోదు, సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ స్థాయిలో నోటీసులు జారీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలను గ్రామస్థాయిలో చదివి వినిపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పాల్గొన్నారు.

## ఉరుమడ్లలో పలు కార్యక్రమాల్లో డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

**చిట్యాల, ఆగస్టు 31 (అక్షర కలం)**

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ, మారెమ్మ, పాపమ్మ ఆలయాల నిర్మాణంలో భాగంగా నిర్వహించిన ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఊర చెరువు వద్ద ముత్యాలమ్మ నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఉరుమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన గుత్తా అమిత్ రెడ్డి.. 8, 9, 10వ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ సాగర్ల భానుశ్రీ భిక్షం, ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్, మాజీ ఎంపీటీసీ పోలగొని స్వామి, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# జీవోలు లెక్క చేయని ప్రయివేట్ బడులు

--ఫీజు రాయితీకి ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం మంగళం

--అక్రిడిటేషన్ కార్డులున్నా నిరాకరణ

--జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

--నోటీసులు ఇవ్వాలని జర్నలిస్టుల డిమాండ్




**అక్షరకలం దేవరకొండ**

జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు (జీవో) జారీ చేసినప్పటికీ ప్రయివేట్ యాజమాన్యాలు దాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. నల్గొండ జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. ముఖ్యంగా దేవరకొండ మండలం తాటికోల్ పరిధిలోని ఒక ప్రయివేట్ యాజమాన్యం తీరుపై వర్కింగ్ జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు చూపించినప్పటికీ తమ పిల్లలకు ఫీజు రాయితీ ఇచ్చేందుకు పాఠశాల యాజమాన్యం నిరాకరిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పించిన హక్కులను కాలరాస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జీవోను ఉల్లంఘిస్తూ జర్నలిస్టులకు రాయితీ నిరాకరిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు వెంటనే హెచ్చరిక నోటీసులు (షోకాజ్ నోటీసులు) జారీ చేయాలని, ఆదేశాలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరుతున్నారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

## ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు

## 'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు

**హైదరాబాద్,**

హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్? భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (÷ూక్షం÷ూ) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి. ÷-రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓఎ÷ు), లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ÷-రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను త్రి-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి ఈ పర్యటన పెద్ద బలం ఇచ్చింది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మధ్యంతర లక్ష్యానికీ ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు కుదరడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. తెలంగాణ యువత, పిల్లలకే కాకుండా దేశంలోని విద్యార్థులకు కూడా ప్రపంచస్థాయి విద్య అందేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నేనే నాయకత్వం వహిస్తాను' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదివి యువత ప్రపంచస్థాయిలో మంచి నిపుణులుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని సాధించడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మెరికా పర్యటనలో తెలంగాణ బృందం నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ చర్చల అనంతరం పలు కీలక ఒప్పందాలు పూర్తయ్యాయి. భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా టెక్ తెలంగాణలో పరిశ్రమలకు అవసరమైన, భవిష్యత్తు ఉద్యోగాలకు ఉపయోగపడే విద్యా విధానాలను తీసుకురావడంపై సహకరించనుంది. ÷ుద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పిల్లలు, యువతకు విద్య, నైపుణ్యాలు, క్రీడలను తన ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటిగా పెట్టుకున్నారు. నర్సరీ నుంచి కేజీ, ప్రాథమిక, హైస్కూల్ వరకు విద్యా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నైపుణ్య శిక్షణ, క్రీడా విద్యను కూడా బలోపేతం చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో భారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇప్పటికే నాలెడ్జ్ ఎకానమిలో మంచి స్థానం సంపాదించిందన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో హైదరాబాద్ ముందుందని చెప్పారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీల నుంచి మంచి విద్య పొందిన మానవ వనరులే హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన బలమన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, కంపెనీలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కాలేజీల ద్వారా నైపుణ్యం కలిగిన బ్లూ కాలర్ ఉద్యోగులను తయారు చేస్తామని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో తయారీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల స్వల్పకాలిక కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను హైదరాబాద్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు ఇన్‌స్టిట్యూట్‌లోని తరగతి గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నవంబర్ నుంచే హైదరాబాద్‌లోని ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో భారత్ ఫ్యూచర్ సిటీలోనూ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌కు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

÷ుసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ విద్యాసంస్థలు, క్రీడా సదుపాయాలు రాష్ట్ర అభివృద్ధిపై చూపే ప్రభావంపై ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశ్రమల రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఇప్పుడు విద్య, పరిశోధన, నైపుణ్యాల రంగాల్లోనూ అదే స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో అడుగుపెడితే తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో కొత్త పెట్టుబడులు, కొత్త కంపెనీలు, కొత్త ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది. మూడు ట్రిలియన్ తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. విద్య, నైపుణ్యం, పరిశోధన, పరిశ్రమలను కలిపి ముందుకు తీసుకెళ్లే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రయత్నం తెలంగాణ భవిష్యత్తుకు కొత్త బాట వేస్తోంది.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో అధికారులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మోటూరి శ్రీనివాస్ లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన సిద్ధి మల్లేష్ తమకు చెందిన భూమి ఇతరుల పేరిట అక్రమంగా పట్టా మార్పు జరిగిందని, ఇట్టి పట్టా రద్దు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ళకు చెందిన ఆవుల వెంకటేశం తనకు గ్రామ శివారులో ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ తమ గ్రామపంచాయతీలో మురుగు కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులతో సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారుల పాల్గొన్నారు.

# ప్రజావాణికి (70) ఫిర్యాదులు



**అక్షర కలం రంగారెడ్డి**

లసోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (70) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 47, ఇతర శాఖలకు 23, మొత్తం 70 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిసిఒ గా మైఖేల్ బోస్ బాధ్యతల స్వీకరణ

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

నల్లగొండ జిల్లా సహకార శాఖ అధికారి ( డి సి ఓ )గా మైఖేల్ బోస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిసిఒగా సేవలందించి పదవీ విరమణ పొందిన పత్య నాయక్ స్థానంలో ఆయన ఈ నూతన బాధ్యతలను చేపట్టారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మైఖేల్ బోస్ మాట్లాడుతూ.. జిల్లాలోని సహకార సంఘాల బలోపేతానికి, రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మైఖేల్ బోస్ ఇంతకుముందు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ )లో జాయింట్ రిజిస్ట్రార్ (డి అర్ )గా సుదీర్ఘ కాలం సేవలందించారు. ఈ సందర్భంగా సహకార శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
మెదక్ - సంగారెడ్డి - సిద్దిపేట

# పాదయాత్ర విజయవంతం కావాలని ఏడుపాయల సన్నిధిలో ప్రత్యేక పూజలు....

**కొల్చారం, ఆగస్టు31(అక్షర కలం)**

కొల్చారం మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి వెల్దుర్తి నుండి పిల్లి కొట్టాల వరకు పాదయాత్ర చెప్పడుతున్న సందర్భంగా శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని సన్నిధిలో ప్రధాన అర్చకులు పార్థివ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు సంతోష్ రావు, కొల్చారం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్, తుక్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు, అంసానిపల్లి సర్పంచ్ రమేష్ గీత, తుక్కాపూర్ ఉపసర్పంచ్ ఆరే రవీందర్, మాజీ సర్పంచ్ గడ్డమీది నర్సింలు, కొమ్ముల యాదగౌడ్, చిన్న ఘనపూర్ పి ఎస్ సి ఎస్ వైస్ చైర్మన్ రాజు గౌడ్, ధనరాజ్,



గౌరీ శంకర్ మాజీ ఎంపీటీసీ సిద్ధ రాములు ,సురేష్ గౌడ్, శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

## 209 సర్వే నెంబర్ లో కాస్తుల్లో ఉన్న రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని... - సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా....



**కొల్చారం, ఆగస్టు 31(అక్షర కలం)**

209 సర్వే నంబర్ లోని భూమి కాస్తులు గత 20 సంవత్సరాల నుండి ఉన్న రైతులకు భూమి పట్టా పాస్ పుస్తకాలను వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని సోమవారం కొల్చారం మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు రైతులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ మాట్లాడుతూ కొంగోడు గ్రామంలోని కొంతమంది నిరుపేదలు 2006 సంవత్సరం నుండి గ్రామానికి చెందిన 86 కుటుంబాలు భూమిని సాగు చేసుకుని కాస్తులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి భూమికి సంబంధించిన పాసుపుస్తకాలను ప్రభుత్వం ఇవ్వకపోవడం తో రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు రైతుబంధు వంటి సౌకర్యాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం తమ కు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతులు గతంలో అనేకసార్లు ప్రభుత్వం దృష్టికితీసుకుపోయినప్పటికీ ఇప్పటివరకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడాన్ని రైతుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమైతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాస్తు దారులు దాసు, విజయ, జయమ్మ, పోచయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బాలిక సంరక్షణ అందరి బాధ్యత.... - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....



**మెదక్, ఆగస్టు 31(అక్షరకలం)**

బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించడం జరిగింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో -- బేటీ పడావో (బిబిబిపి) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ తోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం మరియు సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బాలికల హక్కులు, భద్రత, విద్య భవిష్యత్ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాఖీ వేడుకల ద్వారా అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు బాలికల భద్రత గౌరవాన్ని కాపాడాలనే సామాజిక బాధ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని "బాలికలను రక్షిద్దాం -- బాలికలను చదివిద్దాం" అనే బి బి బి పి సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి,బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.... - డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్....

**మెదక్, ఆగస్టు 31(అక్షర కలం)**

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 48 దరఖాస్తులను స్వీకరించారు.అందులో భూ భారతి 16, ఇందిరమ్మ ఇండ్లు 6,పెన్షన్ 1, ఇతర 25 మొత్తం 48 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలే కేంద్రంగా... ప్రగతే లక్ష్యంగా... 1000 రోజుల ప్రజా పాలన....

**- బుడ్డ భాగ్యరాజ్ మాజీ సర్పంచ్ మెదక్ డిసిసి కార్యదర్శి....**

**మెదక్ ఆగస్టు 31(అక్షర కలం)**



ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మన దుబ్బాక నియోజవర్గం ఇన్చార్జ్ దుబ్బాక టైగర్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణలో కొత్త పాలనా అధ్యాయం ప్రారంభమైంది. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి ఉచిత విద్యుత్, రైతు సంక్షేమం , రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండ విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇవి కేవలం పథకాలు కాదు... ప్రజల జీవితాల్లో మార్పుకు బాటలు వేసే సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాలు.రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మెదక్ కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ అన్నారు. "1000 రోజులు... ప్రజల కోసం చేసిన పనికి నిదర్శనం.. రాబోయే రోజులు... తెలంగాణ అభివృద్ధికి స్వర్ణయుగానికి నాంది అని బుడ్డ భాగ్యరాజ్ తెలిపారు.

## మాధవానంద సరస్వతి స్వామిని దర్శించుకున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్...



**కొల్చారం, ఆగస్టు 31(అక్షర కలం)**

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలవ సుజాత సోమవారం కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వాములవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందుకున్నారు. అనంతరం ఆలయ విశేషాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు.

## సర్పంచ్ పెద్దమ్మల సత్యమును యశోద ఆసుపత్రిలో పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 31:**

నంగునూరు మండలం అప్పలాయచెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం కి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న పెద్దమ్మల సత్యంని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి మనోధైర్యం కల్పించారు.ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తన బాధ్యతగా భావించే వంగ రాజేశ్వర్ రెడ్డి పెద్దమ్మల సత్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల్లో స్థానిక గ్రామపంచాయతీ పేరు నమోదు చేయాలి... సర్పంచ్ శైలజ రమేష్



**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 31:**

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో స్థానిక గ్రామపంచాయతీ పేరు నమోదు చేయకుండా రెవెన్యూ గ్రామపంచాయతీ పేర్లు నమోదు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని ప్రభుత్వ పథకాలు, రేషన్ తదితర సేవలు పొందడంలో సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తప్పులను సరిచేసి, ఆధార్‌లో ఉన్న వివరాలతో పాటు స్థానిక గ్రామపంచాయతీ పేరును సరిగ్గా నమోదు చేసి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని సర్పంచ్ కోరారు.

## ఇంద్రకరణ్ గ్రామంలో రోడ్డు పనులు ప్రారంభం



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం..**

కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో సోమవారం రోడ్డు నిర్మాణ పనులు సర్పంచ్ శంకరి రాజు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సుమారు ఐదు లక్షల వ్యయంతో ఇంద్రకరణ్ గ్రామం నుండి గీతం యూనివర్సిటీ వరకు సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించినట్టు సర్పంచ్ శంకరి రాజు తెలియజేశారు. గ్రామంలో మౌలిక వసతులు, డ్రైనేజీ, సిసి రోడ్లు, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శుభవాని, ఉపసర్పంచ్ కొన్యాల శ్రావణి రాజేందర్ రెడ్డి, మల్లేశం యాదవ్, వెంకటేశం,వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

**-ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

అక్షర కలం, అందోలు:

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ వారితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సమస్యలకు చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955

అక్షరకలం తెలుగు దినపత్రిక




# ప్రతి విన్నపాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి... ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్,

అక్షర కలం / భద్రాచలం





వివిధ గిరిజన గ్రామాల నుండి గిరిజన దర్బార్ లో వివిధసమస్యల గురించి దరఖాస్తులు చేసుకున్న గిరిజనులకు సంబంధిత యూనిట్ అధికారులు సత్వరమే పరిష్కారం చూపాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ ఎస్డిసి ట్రైబల్ వెల్ఫేర్ ఆనందకుమార్ డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ తో కలిసి ఏజెన్సీ గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించారు. ఏజెన్సీ గిరిజన గ్రామాలలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనులు భూ సమస్యలు, గృహాలు, ఉపాధి, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై తమ సమస్యలను పిఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. గిరిజనుల నుంచి స్వీకరించిన ప్రతిదరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని యూనిట్ అధికారులకు ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలనువెంటనేపరిష్కరించాలని, ఇతర సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శాఖలమధ్యసమన్వయంతో పనిచేసి గిరిజనులకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించిన అర్జీలు పోడు భూముల సమస్యలు వ్యక్తిగత సమస్యలు గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించుట కొరకు స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు ఎల్ టి ఆర్ భూముల సమస్యలు పరిష్కరించుట కొరకు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చేరడానికి శిక్షణలు అందించుట కొరకు దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు పంట పొలాలకు నీరు అందించడానికి కరెంటు బోరు మంజూరి కొరకు రైతుబంధు రుణాలు ఇప్పించుట కొరకు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, ఎల్ టి ఆర్ డి టి మనిధర్, పి వి టి జి అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, మిషన్ భగీరథ ఏ ఈ ఈ వసుంధర, ఐ సి డి ఎస్ కోఆర్డినేటర్ మౌనిక, వివిధ విభాగాల సిబ్బంది నరేందర్, వెంకటేశ్వర్, విజయ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో పర్యటించి కాంగ్రెస్ కమిటీలను నియమించిన మండల రామ్ మహేష్ బానోతు రాంబాబు.



అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-

ఇల్లందు మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు ఇల్లందు మాజీ వైస్ ఎంపీపి మండల రామ్ మహేష్, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులను ఎంపిక చేశారు. గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం, ప్రజా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంపై నేతలు ప్రత్యేక దృష్టిని సారించారు. మండలంలోని పోచారం తండా, బోయితండా, మాణిక్యారం, ముత్తారపు కట్ట, రొంపేడు, మామిడి గుండాల, సి ఎస్ పి బస్తీ గ్రామాల్లోకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా పర్యటిస్తూ నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండల రామ్ మహేష్, బానోతు రాంబాబులు మాట్లాడుతూ కాంగ్రెస్ కమిటీ ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశానుసారం గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యంగా ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నేతలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని కార్యకర్తలకు నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముకగా నిలుస్తారని, కార్యకర్తల కష్టాన్ని, ప్రజల నమ్మకాన్ని గౌరవిస్తూ పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని నాయకులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి ఎట్టి హరిక్రిష్ణ,జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు ఇస్లావత్ సతీష్,డిసిసిబి డైరెక్టర్ జనగం కొటేశ్వరరావు,ఇల్లందు ఎస్సి సెల్ మండల అధ్యక్షులు కాకటి భార్గవ్,నాయకులు మూతి క్రిష్ణ, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్,పోచారం తండా సర్పంచ్ వాంకుడొత్ భారతి శ్రీను,చెన్నూరి శ్రీను,చెన్నూరి క్రిష్ణ,ఉపేందర్,పడిగ సంపత్,ధారవత్ తులిశ్యా,పాయం క్రిష్ణ ప్రసాద్,మోకాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

## ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం:

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :





స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖలు మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అంగీకరిస్తే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 250 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు తావులేకుండా శాంతిభద్రతలను కాపాడాలన్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, అయితే ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని, వాటిని సక్రమంగా నిర్వహించి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఖమ్మం ప్రజలపైనే ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## "బాజోజు సావిత్రమ్మ కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచిన "చల్లా కృష్ణ "



అక్షర కలం/ ఖమ్మం నగరం :

పాలేరు, నియోజకవర్గ పరిధిలోని 59వ, డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన బాజోజు కోటాచారి అమ్మ సావిత్రమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యశీ కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ "చల్లాకృష్ణ" తుంబూరు దయాకర్ రెడ్డి సలహామేరకు" మృతుల కుటుంబాన్ని పరామర్శించి , ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు, సోమవారం"దశదిన కార్యక్రమానికి " తమ వంతు సహాయంగా "చల్లా కృష్ణ" 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లపుడూ కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ టీమ్ సభ్యులు పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు.

## 15 మంది పోలీస్ అధికారులకు ప్రతిభ పురస్కారాలు..

### పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం 2026 జూన్ 2 పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. ఉత్తమ సేవ పతకాలు సాధించిన ముగ్గురిలో అడిషనల్ డీసీపీ బి.రామానుజం, హెడ్ కానిస్టేబుళ్లు వి.బిక్షపతి, కె సూర్యప్రకాష్ రెడ్డి వున్నారు. వారితో పాటు సేవ పతకాలు సాధించిన (12) మందికి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 15 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు.

## విముక్తి జాతుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి.. సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి గ్రేసమ్మ

### ఖమ్మంలో ఘనంగా విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమం

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

వివక్షకు గురైన విముక్తి జాతుల అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఐ. గ్రేసమ్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ చారిత్రకంగా వివక్షకు గురైన విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు సమాజం కూడా తన వంతు బాధ్యతగా సహకరించాలని అన్నారు. విముక్తి జాతుల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విముక్తి జాతుల హక్కులను పరిరక్షిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన పెంచి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేసినప్పుడే విముక్తి జాతులు, సంచార, అర్ధ సంచార వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపు సోమరాజు, డాక్టర్ కె.వి. కృష్ణారావు, దేరంగుల బ్రహ్మం, పొదిలి నరసింహ రావు, షేక్ మస్తాన్, పఠాన్ బడే ఖాన్, బత్తుల గోపాల్, ఒర్సు కృష్ణా, మల్లూరు కృష్ణయ్య, బాలేఘాట్ నరసింహ రావు, సిహెచ్ వెంకన్న, షేక్ ఉస్మాన్, ఎస్కే మస్తాన్, బి .నాగేశ్వరరావు, జి రాము, వి.ఉపేందర్, ఎస్కే షకీలా, చెల్లా మల్లాద్రి, బత్తుల నాగరాజు, కే సురేష్, వేముల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమంలోపాల్గొనిఅభినందించిన. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,

అక్షర కలం / భద్రాచలం

భద్రాచలం పట్టణంలో కరకట్ట రోడ్లో గల కాకతీయ గ్రాండ్ కమ్మ సత్రం నందు ఆర్టీసీ ఉద్యోగులు రమణ ఎడిసి భద్రాచలం డిపో మరియు అల్లం నాగేశ్వరరావు స్టేషన్ మేనేజర్, భద్రాచలం డిపో పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, పట్టణ ప్రముఖులు తాళ్లూరి పంచాక్షరయ్య తో కలిసి హాజరై పదవీ విరమణచేస్తున్నఉద్యోగులను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ. ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం గర్వించదగ్గ విషయమని, ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను అభినందించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన భవనాల నిర్మాణం కోసం మంత్రులు శంకుస్థాపన

అక్షర కలం/ మహబూబాబాద్ :



మండల కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయలు ఇనుగుర్తి, దంతాలపల్లి, సిరోలు, నూతన భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్య సభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే లు డాక్టర్ భూక్య మురళి నాయక్, కె.ఆర్ నాగరాజు , గండ్ర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బానోతు సునీత, తదితరులు..

అక్షర కలం
తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్ - వనపర్తి - నారాయణపేట
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల

# పుట్‌పాత్‌లు కబ్జా చేసుకో.. దర్జాగా కిరాయిలు ఇచ్చుకో!

**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసుకుని.. అందులో రేకుల డబ్బాలు ఏర్పాటు చేసి.వాటిని చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ కొందరు అక్రమార్కులు నెలనెలా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గద్వాల్ జిల్లా కేంద్రంలో వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి చెందిన స్థలాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి సాగిస్తున్న ఈ దందాపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.జిల్లా కలెక్టరేట్ సమీపంలోని మున్సిపాలిటీకి చెందిన విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించి రేకుల డబ్బాలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఉపాధి కోసం వచ్చే చిరు వ్యాపారులకు ఒక్కో డబ్బాను నెలకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు అద్దెకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేసి.. వాటి నుంచి నెలనెలా కిరాయిలు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**పాదచారులకు ఇబ్బందులు**

ఫుట్‌పాత్‌లు, రహదారి పక్కన ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురికావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచేందుకు స్థలం లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చి



వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వాహనాల రాకపోకల మధ్య ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తొలగింపులు ఎక్కడివరకు?**

ఇటీవల కృష్ణవేణి చౌరస్తా, భీంనగర్ ప్రాంతాల్లో వెలసిన అక్రమ డబ్బాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. అయితే పట్టణంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే తొలగించిన ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణవ్యాప్తంగా ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**కౌన్సిల్ తీర్మానం చేయాలి**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేసి అద్దెలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని అక్రమ డబ్బాలపై సమగ్రంగా చర్యలు తీసుకునేలా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డబ్బాలు వేసి కిరాయిలు వసూలు చేస్తున్న వారి జేబులు నిండుతున్నా.. రోజంతా కష్టపడే చిరు వ్యాపారుల కుటుంబాల పొట్టలు నిండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బండ్ల

### గద్వాల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక వినతి



**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం అలంపూర్‌లోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కేంద్రమంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. గద్వాల జిల్లా అభివృద్ధి, రైల్వే సౌకర్యాల విస్తరణ, ప్రజలకు మెరుగైన రవాణా వసతుల కల్పన తదితర అంశాలపై కేంద్రమంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు, అదనపు రైళ్లకు స్టాపింగ్, రైల్వే ప్రాజెక్టుల విస్తరణ వంటి అంశాలకు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పాన్ డబ్బాలో చోరీ.. రూ.80 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు అపహరణ

**గద్వాల్ టౌన్ అక్షరకలం:**



గద్వాల: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వైఎస్సార్ చౌరస్తాలో పాన్ డబ్బాలో చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు పాన్ డబ్బా తాళాలు పగులగొట్టి అందులో దాచిన నగదు, సెల్‌ఫోన్లను అపహరించారు. గద్వాల పట్టణానికి చెందిన సుధీర్ వైఎస్సార్ చౌరస్తాలో పాన్ డబ్బా ఏర్పాటు చేసుకుని సిగరెట్లు విక్రయిస్తూ, సెల్‌ఫోన్ రీచార్జ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి షాప్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం వేకువజామున గస్తీ నిర్వహిస్తున్న గుర్ఖాలు పాన్ డబ్బా తెరిచి ఉండటాన్ని గమనించి నిర్వాహకుడు సుధీర్‌కు సమాచారం అందించారు.వెంటనే అక్కడికి చేరుకున్న సుధీర్ పాన్ డబ్బా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. లోపల పరిశీలించగా దాచిన సుమారు రూ.80 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని గద్వాల టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు.సమాచారం అందుకున్న టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. బాధితుడు సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గద్వాల టౌన్ ఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు.

## పటిష్ఠ బందోబస్తు మధ్య కేంద్ర మంత్రి పర్యటన ప్రశాంతం

**గద్వాల్ టౌన్ అక్షరకలం**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో పర్యటించారు. అలంపూర్, గద్వాల రైల్వే స్టేషన్లను వారు సందర్శించి పలు అంశాలను పరిశీలించారు.జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టారు. పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిస్థితులను పర్యవేక్షించారు.కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పర్యటన ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారుజిల్లా పోలీస్



శాఖ ముందస్తు ప్రణాళిక, అధికారుల సమన్వయం, సిబ్బంది అప్రమత్తతతో కేంద్ర మంత్రి, ప్రజాప్రతినిధుల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యటన విజయవంతంగా పూర్తయ్యేలా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు.

## కల్యాణ్ కుమార్ దూకుడు. 5 కిలోల గంజాయి పట్టివేత

**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

జోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల పట్టణంలో గంజాయి అక్రమ రవాణాపై టౌన్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాలతో టౌన్ ఎస్ఐ ఎం. కల్యాణ్ కుమార్ ప్రత్యేక నిఘా పెట్టి చేపట్టిన తనిఖీల్లో 5.057 కిలోల గంజాయి పట్టుబడింది. ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను డీఎస్పీ మొగ్లయ్య నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ టి. శ్రీను, ఎస్ఐ కల్యాణ్ కుమార్ వెల్లడించారు.ఆదివారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు గద్వాల వ్యవసాయ మార్కెట్ సమీపంలో టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఏపీ-22-ఎస్-2561 నంబర్ బజాజ్ ప్లాటినా బైక్‌పై వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా.. ప్లాస్టిక్ సంచిలో 10 ప్యాకెట్లలో గంజాయి బయటపడింది.



పరీక్షలు నిర్వహించగా గంజాయిగా నిర్ధారణ కావడంతో మొత్తం 5.057 కిలోలు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల అదుపులోకి తీసుకున్న వారిని షనగపల్లి గ్రామానికి చెందిన బోయ బీసన్న (50), విఠలాపురం గ్రామానికి చెందిన తనగల గోకరి (29)గా గుర్తించారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో వ్యవసాయ భూముల్లో గంజాయి సాగు చేసి, ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది.? సాగు చేస్తున్న ప్రాంతాలు ఏవి.? గతంలో ఎవరెవరికి విక్రయించారు.? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**కల్యాణ్ టీమ్‌కు డీఎస్పీ అభినందనలు**

గంజాయి పట్టివేతలో చురుగ్గా వ్యవహరించిన టౌన్ పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కానిస్టేబుళ్లు చందు, కిరణ్‌కుమార్, వీరేష్ల కు బహుమతులు అందజేశారు. టౌన్ ఎస్ఐ కల్యాణ్ కుమార్ నేతృత్వంలో పోలీసులు సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు.

**సమాచారం ఉంటే పోలీసులకు చెప్పండి**

పట్టణంలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా, అక్రమంగా తరలిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ ప్రజలను కోరారు. మాదకద్రవ్యాలపై నిఘా కొనసాగుతుందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఆలంపూర్ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యత

**శక్తిపీఠం విశిష్టతకు అనుగుణంగా జోగులాంబ రైల్వే స్టేషన్ అభివృద్ధి**

**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి**

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

ఆలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం అభివృద్ధితో పాటు, రైల్వే స్టేషన్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.6.07 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న జోగులాంబ రైల్వే స్టేషన్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోమవారం సందర్శించారు. ముందుగా రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న దర్శనీయ స్థలాల సమాచారంతో ఏర్పాటు చేసిన బోర్డులను తిలకించారు. ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి స్టాల్ వద్ద నిర్వాహకులతో మాట్లాడి అనంతరం టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ జోగులాంబ ఆలయ అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ ద్వారా ఇప్పటికే రూ.37 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర వెల్లడించారు. ఆలయాల అంతర్గత అభివృద్ధి, సంరక్షణకు కేంద్ర సాంస్కృతిక శాఖ, ఆర్కియాలజికల్ సర్వే



ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కూడా అవసరమైన నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఆలంపూర్ అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ బస్‌స్టాండ్, బ్రిడ్జి, రోడ్లు తదితర కొన్ని మౌలిక వసతుల పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటం వలన సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఆయా పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఆలంపూర్ అభివృద్ధికి సంబంధించిన అన్ని పనులను సమగ్రంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్‌ను కేంద్ర మంత్రి కోరారు. ఆలంపూర్‌ను మరింత అభివృద్ధి చేసి భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జోగులాంబ అమ్మవారి శక్తిపీఠానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, రవాణా తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలన్నారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో ఆధునికీకరిస్తున్నామని, 2027 నాటికి ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆలంపూర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జోగులాంబ అమ్మవారి ఆధ్యాత్మికత, ఆలంపూర్ శక్తిపీఠం విశిష్టత ప్రతిబింబించేలా రైల్వే స్టేషన్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే జోగులాంబ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో పాటు ఆలంపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్‌ను మరింత విస్తరిస్తూ సింగిల్ లైన్లను డబుల్ లైన్లుగా, డబుల్ లైన్లను ట్రిపుల్ లైన్లుగా, అవసరమైన ప్రాంతాల్లో నాలుగు లైన్లుగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, ఆలంపూర్ శాసనసభ్యులు విజేయుడు, దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డిఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్ ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు.

**గద్వాల్ అక్షర కలం ప్రతినిధి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి సోమవారం ఆలంపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి హరిత హోటల్లో బస చేసిన కేంద్ర మంత్రి ఉదయం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి మొదట బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో, మేళతాళాలతో ముఖ్య అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. మొదట వినాయకుని పూజల్లో పాల్గొన్న అతిథులు తర్వాత స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో కేంద్ర మంత్రి ఇతర అతిథులతో కలిసి మొక్కను నాటారు. ఆలయ అధికారులు, పూజారులు అతిథులకు స్వామి,అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు క్షేత్ర విశిష్టతను అతిథులకు వివరించారు. ఆలయం నుంచి తిరిగి హరిత హోటల్ కు చేరుకున్న అతిథులకు జిల్లాకు చెందిన పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు, పలువురు రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఆయా సమస్యల



పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అక్కడి నుంచి జోగులాంబ రైల్వే స్టేషన్ కు బయలుదేరే ముందు మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండి గౌతమి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు, ఈవో పురంధర్, అదనపు కలెక్టర్ మధుమోహన్, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, భాజపా రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

## మరికల్ గ్రామపంచాయతీ షాపు వ్యవహారంపై ఫిర్యాదు: - బీజేపీ మండల నాయకులు :

**నారాయణపేట, సెప్టెంబర్,01, (అక్షర కలం)**



మరికల్: మరికల్ గ్రామపంచాయతీకి సంబంధించిన ఒక షాపు విషయంలో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో , ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న విషయం ఏంటంటే కర్లీ శ్రీకాంత్ (తండ్రి మార్కండేయ) గత 25 సంవత్సరాలుగా షాపును స్వాధీనం చేసుకుని బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సుమారు నాలుగు నెలల క్రితం గ్రామపంచాయతీ షాపులకు టెండర్లు ప్రకటించినప్పుడు టెండర్ల ద్వారా గ్రామపంచాయతీకి సుమారు నెలకు రూ.10 లక్షల లాభం రావనున్నది. అయితే శ్రీకాంత్ తనదిదైన ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు చూపిస్తూ, తప్పుడు పత్రాలతో కోర్టు కేసు వేస్తున్నట్టు పేర్కొంటూ అడ్వాన్స్ ఇవ్వకుండా, నెలవారీ అద్దెలు చెల్లించకుండా షాపు నిబంధనలు ఉల్లంఘిస్తూ కొనసాగిస్తున్నారని ఆరోపణలు చేశారు. స్థానికులు లబ్ధి దోచబోతున్నట్లు, తద్వారా ఇతర షాపుదారులు మరింత కబ్జాకు ప్రేరేపించబడుతారని తెలియజేశారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రజావాణి ద్వారా జిల్లా అధికారులు, ఎంపీడీవోను ఆశ్రయిస్తూ తక్షణ విచారణ, తప్పుడు పత్రాలపై చర్య, అనధికార కబ్జా తొలగింపు, బకాయిల అద్దె రికవరీ మరియు షాపును పునఃటెండర్ ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం కలిగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇలా చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి వారు సిద్ధంగా ఉన్నారు, అని స్థానిక నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మంగలి వేణుగోపాల్, రాజేష్ యాదవ్, శివకుమార్, రమేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు.




# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

## ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు...

## ఉద్యోగుల నిరసన సభను అభినందన సభగా మార్చుకోవాలని హితవు

## టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

**జగిత్యాల, ఆగస్టు 31 ( అక్షర కలం ):**

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి మా హక్కులను కాపాడాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెండేళ్లు ఆగామని, ఇక ఓపిక నశించిందని రేవంత్ రెడ్డి వెంటనే ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఎన్జీవో) కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ జగిత్యాలలో జేఏసీ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 17 నెలలుగా పెండింగ్ లో ఉన్న 5 డీఏలు, పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డులు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, హామీలకే పరిమితం కాకుండా జిఓలు విడుదల చేయాలనీ ఆయన



హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని జగదీశ్వర్ తెలిపారు. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10న ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగదీశ్వర్ ప్రకటించారు. ఈ నిరసనకు ఉద్యోగులు, పెన్షనర్లు, టీచర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేస్తూ.. ఉద్యోగుల మధ్య కొట్లాట పెట్టించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. బకాయి పడ్డ డబ్బులు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని నిలదీశారు. ఉద్యోగ సంఘాలకు గుర్తింపు లేకుండా చేశారని జగదీశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించి, ఈ ఉద్యోగ నిరసన సభను అభినందన సభగా మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. మన నిరసనను ప్రభుత్వానికి శాంతియుతంగా తెలియజేస్తామని, గత పోరాటాల స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని జగదీశ్వర్ ఉద్యోగ వర్గాలకు పిలుపునిచ్చారు. ఈ ప్రెస్ మీట్ లో జగిత్యాల జిల్లా టీఎన్జీవో నాయకులు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, జేఏసీ నేతలు కందుకూరి రవిబాబు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ, ఉమ్మడి నారాయణ, చిర్ర సతీష్, శ్రీనివాస్,ఉపాధ్యాయ సంఘం నేతలు బోయినిపెల్లి ఆనందరావు,యాళ్ల అమర్నాథ్ రెడ్డి, భైరం హరికిరణ్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్,వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి 'నో'.. రూ.35 వేల పనికి 'ఎస్'.!

**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

మున్సిపల్ కౌన్సిల్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్ల డీసెంట్

37 వార్డులకు నిధులెక్కడ..? ఆరు నెలల్లో ఒక్క రూపాయి అభివృద్ధి చేయలేదంటూ ఫ్లోర్ లీడర్ పులిపాటి వెంకటేష్ ఫైర్

10 శాతం భూముల్లో నిర్మాణ అనుమతులపై సంటెన్న నిలదీత

గద్వాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై అధికార పక్షాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిలదీశారు. ఎజెండాలోని 13 అంశాల్లో 12వ అంశంగా ఉన్న నాన్‌వెజిటేబుల్ ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ షాపులకు కలరింగ్, వైరింగ్ తదితర పనుల కోసం రూ.35 వేల కేటాయింపుపై బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ పులిపాటి వెంకటేష్‌తో పాటు కౌన్సిలర్లు సంటెన్న, గోపాల్, మోహన్ యాదవ్, మంజుల కిరణ్, సునీత రాములు, లతా రామకృష్ణ డీసెంట్ వ్యక్తం చేశారు.

**37 వార్డులు ఉంటే.. అభివృద్ధి మాత్రం ఎక్కడ?**

మున్సిపల్ కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేసి ఆరు నెలలకు



పైగా గడిచినా 37 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంపై ఫ్లోర్ లీడర్ పులిపాటి వెంకటేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి ఆదాయం వస్తున్నా వార్డుల అభివృద్ధికి నిధులు ప్రశ్నించారు."నిధులు ఉన్నప్పుడు వార్డుల అభివృద్ధి ఎందుకు కనిపించడం లేదు?" అని అధికారులను ప్రశ్నించారు. వచ్చే కౌన్సిల్ సమావేశం నాటికి 37 వార్డులకు ఒక్కో వార్డుకు కనీసం రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు.

**10 శాతం భూమిలో పర్మిషన్ ఎలా వచ్చింది?**

కౌన్సిలర్ సంటెన్న మరో కీలక అంశాన్ని సమావేశం ముందుంచారు. జమ్మిచేడు గ్రామం గతంలో గ్రామపంచాయతీ పరిధిలో ఉండగా, అనంతరం మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో 10 శాతం భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా మంజూరు చేశారనే ప్రశ్నను లేవనెత్తారు.జమ్మిచేడు గ్రామపంచాయతీ మున్సిపాలిటీ పరిధిలో విలీనం కావడానికి ముందు, తర్వాత జరిగిన పరిణామాలపై స్పష్టత అవసరమని అన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు ఇచ్చారా? లేక నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్లు మంజూరయ్యాయా? అనే అంశంపై అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు.

**వార్డుల సమస్యలపై కౌన్సిలర్ల గళం**

సమావేశంలో కౌన్సిలర్లు లతా రామకృష్ణ, గోపాల్, సునీత రాములు, మంజుల కిరణ్ తదితరులు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం చేయకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొత్తానికి.. రూ.35 వేల పనికి ఎజెండాలో చోటు దక్కినా.. 37 వార్డుల అభివృద్ధికి నిధుల కేటాయింపు మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదన్న ప్రశ్న కౌన్సిల్ సమావేశంలో హాట్ టాపిక్‌గా మారింది. మున్సిపాలిటీ ఆదాయాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారు..? వార్డుల వారీగా అభివృద్ధి నిధుల కేటాయింపులో జాప్యానికి కారణమేంటి..? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జీవితంలో విజయం సాధించాలి:

## -- క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట, సెప్టెంబర్, 01, (అక్షర కలం)

చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విద్యార్థులు, క్రీడాకారులకు సూచించారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఇటీవలే జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన కౌమార దశ బాలికలకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా క్రీడల అభివృధి శాఖ నేతృత్వంలో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న విజేతలు, రన్నర్స్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడిని కలెక్టర్ అభినందించారు. క్రీడా పోటీలలో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొన్నారని ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్లు ఉండటం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే పట్టుదలతో క్రీడాకారులు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, డీవైఎస్ఓ, డీడబ్ల్యూఓతో పాటు క్రీడా విభాగం సిబ్బందిని ఆమె అభినందించారు.

**క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు**




జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఇంకా అనేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలోని స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన నిధులను సమీకరించి, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రవాణా తదితర అవసరాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు సాధ్యమైనంత సహకారం అందిస్తామని చెప్పారు. పోటీలకు వెళ్లే క్రీడాకారుల వివరాలను ముందుగానే జిల్లా పరిపాలన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

**బాలల అభివృద్ధికి క్రీడలు, విద్య రెండూ అవసరం**

బాలల అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణ, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి విద్యలోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను కోరారు.

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారికి విద్యతో పాటు క్రీడల్లోనూ అవకాశాలు కల్పించాలని సూచించారు. అవసరమైన అదనపు సిబ్బంది, ఇతర సహకారాన్ని జిల్లా యంత్రాంగం తరపున అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి**

చదువులో అయినా, క్రీడల్లో అయినా, జీవితంలో అయినా విజయం సాధించాలనే లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ నిర్దేశించుకోవాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం ప్రణాళిక వేసుకుని కష్టపడాలని అన్నారు. మన జీవితం 30 సంవత్సరాల తర్వాత ఎలా ఉండాలనుకుంటున్నామో ఇప్పుడే నిర్ణయించుకోవాలన్నారు. ఈరోజు మనం చేస్తున్న పని భవిష్యత్తులో మన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపయోగపడుతుందా లేదా అనే విషయాన్ని ప్రతిరోజూ ఆలోచించుకోవాలి" అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు మంచిగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడా పోటీల్లో విజయం సాధించిన విజేతలకు మరోసారి అభినందనలు తెలిపారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొని ప్రతిభ చాటిన క్రీడాకారులు, ఇటీవలే నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులను అందజేసి, శాలువా తో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, డీపీఆర్ వో రషీద్, ఎస్ జీ ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, పీడీలు సాయి నాథ్, బాల్ రాజ్, రామకృష్ణ రెడ్డి, వెంకటప్ప, రూప, ఫర్విన్ బేగం, రామ్ మోహన్ గౌడ్, రెజ్లింగ్ కోచ్ శ్రీనివాస్, వాలీబాల్ కోచ్ రాఘవేంద్ర, పీఈటీలు, డబ్ల్యు ఓ కార్యాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఉప సర్పంచులు

**వీణవంక, ఆగస్టు 31 ( అక్షర కలం ):**

వీణవంక మండలం నర్సింగ్ పూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ పోతరవేన వసంతాకుమార్ తల్లి లచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం వీణవంక మండల ఉప సర్పంచులు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసారు.. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు నామిని విజేందర్, మడ్డి మహేష్ , తాళ్లపల్లి మహేష్, రవీందర్ , ఉయ్యాల రాజు , ఐలయ్య , అనిల్ , రాపర్తి సంధ్య, నాగిడి అనిల్, శ్రీనివాస్ ,దాసరపు శ్రీనివాస్, మండల రాజు, తదితరులు పాల్గొన్నారు



# ఇందిరమ్మ ఇళ్లతో పల్లెల్లో పండుగ వాతావరణం

## .... జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





రాయికల్, ఆగస్టు 31(అక్షర కలం): రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లబ్ధిదారుల ఆహ్వానం మేరకు గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై నూతన ఇళ్లను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు చీరలను కానుకగా అందజేశారు. అలాగే పుట్టినరోజు, నామకరణ మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పేదల సొంతింటి కలను సాకారం చేసే గొప్ప కార్యక్రమమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పల్లెలో పండుగ వాతావరణం నెలకొందన్నారు.జగిత్యాల నియోజకవర్గానికి 10 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తున్నామని, ఇప్పటికే తొలి విడతలో 3,500, రెండో విడతలో 2 వేల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ రవిసుధాకర్ పదవీవిరమణ మహోత్సవం




**వీణవంక, ఆగస్టు 31( అక్షర కలం ):**

వీణవంక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) రవి సుధాకర్ పదవీవిరమణ మహోత్సవాన్ని సోమవారం వీణవంకలోని లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీవిరమణ పొందిన ఎంపీడీఓ రవిసుధాకర్‌ను ఎమ్మెల్యే శాలువాతో, ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రవి సుధాకర్ జీవితం ఆయురారోగ్యాలు, సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.. ఎంఈఓ శోభారాణి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మరియు పాలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు వార్డ్ నెంబర్లు అభిమానులు పాల్గొని రవి సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తిరుపతి రెడ్డి, సరిగోమ్ముల వెంకటేష్, నాగిడి సంజీవ రెడ్డి, కట్కూరి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ దాసారపు సరోజన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

# డాకూర్ లో భక్తిశ్రద్ధలతో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

**అక్షర కలం, అందోలు ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్ గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలలో అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆ పోచమ్మ తల్లి ఆశీస్సులు, చల్లని దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వీరి వెంట అందోల్ మాజీ ఎంపీపీలు పి.నారాయణ ముదిరాజ్, అర్జునయ్య, రామ గౌడ్, జె. బాలయ్య, డాకూర్ సర్పంచ్ వసంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎ.శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, జగన్ మోహన్ రెడ్డి, బీర్ల శంకర్, నాగరత్నం గౌడ్, ఉస నాగరాజు, సాయి కుమార్, జేన్న విజయ్ కుమార్, ఖాజా పాషా, యం.డి.గోరే, ఖలీల్, ఇమ్రాన్ ఖాన్ మొగులయ్యలు పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్ - మంచిర్యాల

# అంతర్జాతీయ స్థాయిలో కళలకు, కళాకారులకు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం

## జర్నలిజంలో జాడ క్రాంతి కుమార్ కు జాతీయ పురస్కారం



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31:**

స్థానిక కళలను, కళాకారులను గుర్తించి, వారికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా తెలుగు సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ కృషి చేస్తున్నాయని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ తెలిపారు. తెలుగు సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని ది సిటీ పార్క్ హోటల్ లో నిర్వహించిన జాతీయ పునస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, సాహితీవేత్తలు, సామాజిక సేవకులు, జర్నలిస్టులు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులను వివిధ పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పలువురికి సొసైటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేశారు. ఈ వేడుకల్లో జర్నలిస్టుల విభాగంలో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త) కు జాతీయ పురస్కారం --2026ను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్న క్రాంతి కుమార్‌ను పలువురు జర్నలిస్టులు, మిత్రులు, స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియజేసేలా నిజాలను వెలికితీసి, నిష్పక్షపాత సమాచారాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సాహితీ సామ్రాట్ సూరేపల్లి విజయ తో నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్, మాచవరం నరసింహ సాయి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31:**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంచిర్యాల ట్రాఫిక్ సిఐ ఎండి హన్నాన్ ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ హన్నాన్ మాట్లాడుతూ, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరమని, అలాంటి వాహనాల వల్ల నేరాలు జరిగినప్పుడు గుర్తించడం కష్టమవుతుందన్నారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలకు ముందు, వెనుక సక్రమమైన నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, నెంబర్ ప్లేట్లపై డిజైన్లు, స్టిక్కర్లు, అస్పష్టమైన నంబర్లు ఉండకూడదని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, కారు, ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగులు ఓట్లు వేయలేదా వికలాంగులు అంటే ఎందుకు అంత చిన్న చూపు

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 31 :**



బిఆర్ఎస్ ప్రభుత్వం తరపున వికలాంగుల విభాగం తరుపునుండి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం అశోక్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అలాగే వికలాంగుల విభాగం కార్పొరేషన్ మాజీ ముత్తినేని వీరయ్య కొంచెం నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని సూటిగా మీకు వార్నింగ్ ఇస్తున్నాను లేదంటే మీకు ఉన్న పదవులు ఊడే దాకా మా వికలాంగుల మందరం కలిసి వదిలిపెట్టమని సిద్దిపేట గడ్డ పైనుండి మా హరీష్ అన్న పై చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పని ఎడల సచివాలయం గాంధీ భవన్ మీ పదవులకు మేము ముప్పుగా మారుతామని పత్రిక ముఖంగా మీకు డిమాండ్ చేస్తున్నాను ంత్ రెడ్డి రాముడయ్యాడు. కెసిఆర్ రావణాసురుడు అయ్యాడ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వం పది సంవత్సరాల్లో మూడుసార్లు పెంచిన ఘనత దక్కించుకున్నాడు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి... స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జిల్లాలో ఉన్న విద్య, వైద్య, ఇతర అంశాలను సూచిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, జిల్లా పరిధిలో సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీకి చెందిన సంతోష్ లకావత్ గ్రామంలో ప్రత్యేక అధికారి పాలన కాలంలో సుమారు 9 లక్షల రూపాయల వరకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిప్యూటీ సీఈఓ ఖమ్మంకు రాస్తూ సెప్టెంబర్ 9 నాటికి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాల్సిందిగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామానికి చెందిన పాశం నాగేశ్వరరావు తన కుమార్తె పాశం ప్రియమణిని లంకపల్లి బిసి గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులం పాఠశాలకు మార్చాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బిసి సంక్షేమ అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు.తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరు మీద ఉన్న ఆరు ఎకరాల 30 గుంటల భూమి తన కుమారుడు, కోడలు వారి పేరు మీద పాస్ పుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు కూడా ఎటువంటి సహాయం చేయడం లేదని తన పోషణ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# మర్డర్ కేసులో జీవిత కఠిన కారాగార జైలు శిక్ష మరియు ఫోక్సో కేసులో జీవిత కఠిన కారాగార జైలు శిక్ష

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 31:**

సిద్దిపేట టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో మరియు మర్డర్ కేసులో బోలో రామ్ హరిజన్ సోనూ అనే వ్యక్తికి మర్డర్ కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష మరియు పోక్సో కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష , డబుల్ శిక్ష విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై . జయ ప్రసాద్ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట టు టౌన్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు పై 01/03/2025న కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి సిద్దిపేట టు టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేయడమైనది. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మా రాములు వాదనలు వినిపించగా , ఇప్పటి సిద్దిపేట టు టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.మురళీ , సాక్షాలు సమర్పించిన కోర్టు మానిటరింగ్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు , లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి , టు టౌన్ కోర్టు సీడీఓ లింగారెడ్డి , భరోసా లీగల్ అధికారి సౌమ్య సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించి మర్డర్ కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష మరియు పోక్సో కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష (డబుల్ శిక్ష ) విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు.

# కాంగ్రెస్ తోనే సబ్బండా వర్గాలకు మేలు

**బీఆర్ఎస్ నాయకులు బురదజల్లుడు రాజకీయాలు మానుకోవాలి**

**ఉనికినీ కాపాడుకోవడానికి కే ప్రభుత్వం పై విమర్శలు**

**సిద్దిపేట నిధులు రేవంత్ రెడ్డి కొడంగల్ తీసుకువెళ్లడనే అంశంపై బి ఆర్ స్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా**

**ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్**

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 31**



బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడనికే ప్రభుత్వం పై బురదజల్లుడు రాజకీయాలు చేస్తున్నారనీ ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ మండిపడ్డారు ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల కేంద్రంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిద్దిపేట నిధులు రేవంత్ రెడ్డి కొడంగల్ కు తీసుకువెళ్లాడు అనడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే ఈ విషయం పై బహిరంగ చర్చకు రావాలని బి ఆర్ స్ నాయకులకు సవల్ విసిరారు.సిద్దిపేట రైతులు, నిరుద్యోగులపై చిత్తశుద్ధితో నియోజకవర్గంలో సుమారు 250 కోట్ల తో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది నిజం కాదా అని ప్రశ్నించరు.అంతేకాకుండా సిద్దిపేట నుండి ఇల్లంతకుంట రోడ్డు 2020,2021 సంవత్సరం లో నిధులు మంజూరైనా రోడ్డు వేయకపోవడం హరీష్ రావ్ చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. 10 ఏండ్లు మంత్రి గా ఉండి కనీసం రోడ్లు కూడ వేయకుండా ఇప్పుడు నిధులు రేవంత్ తీసుకుపోయాడని అబద్దాలు ఆడుతూ నియోజకవర్గ ప్రజలను మోసం చేయటం బి ఆర్ స్ నాయకులకుఅలవాటైపోయిందాన్నారు.బి ఆర్ స్ ప్రభుత్వంలో చిన్నకోడూరు మండలం ఎన్ని గ్రామాల్లో డబులు బెడ్ రూమ్ లు ఇచ్చారో అవి ఎవరికీ ఇచ్చారో బి ఆర్ స్ నాయకులు చర్చకు రావాలన్నరు. మార్చ్ 31 తేదీ వరకు పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లకు ఫైనల్ బిల్ సుమారు 300 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందాన్నారు,ఇందిరమ్మ ఇండ్లు లేని ఊరిలో మేము ఓట్ల అడుగమని డబల్ బెడ్ రూమ్ లేని ఊరిలో బి ఆర్ స్ నాయకులు ఓట్లు అడుగవద్దని సవల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు, ఎండి సలీం, సింగిరాల లక్ష్మి, దేవరాయల సోనీ, డిసిసి ప్రధాన కార్యదర్శి సంద బోయిన పరుశురాం యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉడుత ప్రశాంత్,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, ఎస్సీ డిపార్ట్మెంట్ మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము ప్రశాంత్, అల్లిపూర్ గ్రామ ఉప సర్పంచ్ కొలనుపాక శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉడుత జయంత,యూత్ కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనంతగిరి చంద్రశేఖర్,గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టపర్తి చందు, నక్కరాజు, వెంకటేశం, సీనియర్ నాయకులు కొరిమిరాజు, చింతల రాజు, సిద్దుల కుమార్ స్వామి,హరిబాబు, వడ్లూరి అశోక్, వేణు, శేషు, అరుణ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**నూతన అధ్యక్షుడిగా వడ్లకొండ నవీన్ కుమార్**

**పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు.

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ కె శ్రీనివాస్, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ లు నాగేంద్ర గౌడ్, రమేష్, ఏఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వడ్లకొండ నవీన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్ పై 5 ఓట్ల ఆధిక్యంతో రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడుగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన వడ్లకొండ నవీన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ 291, ఉపాధ్యక్షులుగా ఎన్ శ్రీనివాస్ (ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ విభాగం) ఎం తిరుపతి (ఏఎస్ఐ, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్), ప్రధాన కార్యదర్శిగా జె అంజనేయులు (సబ్ ఇన్‌స్పెక్టర్, సీసీబీ రామగుండం), సంయుక్త కార్యదర్శిగా కె ఓంకార్(కానిస్టేబుల్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్), సంస్థాగత కార్యదర్శిగా డి వినోద్ బాబు (కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్), కోశాధికారిగా టి సుందర్ సింగ్ (కానిస్టేబుల్, ధర్మారం పోలీస్ స్టేషన్), కార్యనిర్వాహక సభ్యులుగా ఎండి రిజ్వాన్ షా ఖాన్ (హెడ్ కానిస్టేబుల్ 714, సీఎస్బీ రామగుండం), డి అనిల్ కుమార్ (కానిస్టేబుల్, బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్), సిహెచ్ దేవరాజ్ (కానిస్టేబుల్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్), కార్యవర్గ సభ్యులుగా ఎం రాజిత, (మహిళా పోలీస్ కానిస్టేబుల్, పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్), ఏ కపిల్ (ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్, సీఏఆర్ రామగుండం), డి రాజం (ఏఆర్ఎస్ఐ, సీఏఆర్ బెల్లంపల్లి) లు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని, మొక్కలను అందజేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం విజయం సాధించిన అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు.

# సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకం

**మందమర్రి, ఆగస్టు 31 అక్షర కలం:**



సింగరేణి సంస్థ అభివృద్ధి లోనూ, ఉత్పత్తి ఉత్పాదకత సాధనలోనూ కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమైందని సింగరేణి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి సోమవారం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా జీఎం రాధాకృష్ణ అధ్యక్షతన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి తో 21వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశం (స్ట్రక్చర్ మీటింగ్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎండి అక్బర్ ఆలీ, ఇతర ముఖ్య నాయకులు హాజరై, కార్మిక సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఏరియా గనుల్లో సేఫ్టీ మెటీరియల్, డ్రిల్ రాడ్లు, బిట్లు, రూఫ్ బోల్ట్ల కొరత తీర్చకపోవడం వల్ల బొగ్గు ఉత్పత్తి, కార్మికుల భద్రత తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. కేకే ఓసీపి లో కన్వేయర్ బెల్ట్ కు నష్టం వాటిల్లకుండా, అది సహజంగా పనిచేసేందుకు బెల్టుకు ఇరువైపుల పేరుకుపోయిన షెల్ కుప్పలను వెంటనే తొలగించాలన్నారు. ఏరియా స్టోర్స్ లో ఖాళీగా ఉన్న టెండాల్, టెండాల్ సూపర్వైజర్, ఎస్కార్ట్ డ్రైవర్, లోడింగ్, అన్లోడింగ్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, కంప్యూటర్లు, ముఖ్యమైన రికార్డులు దెబ్బతినకుండా, దెబ్బతిన్న ఆస్బెస్టాస్ షీట్లను తీసివేసి, ఐరన్ రూఫింగ్ షీట్లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా డిస్పెన్సరీ లలో కార్మికులకు సూచించిన అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏరియాలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కొత్త యూనిఫామ్ క్లాత్, షూస్, క్వాలిటీ కిట్లను అందించాలని, నిర్ణీత ప్రాంతంలో మొబైల్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడంతో పాటు పాత ఫర్నిచర్ స్థానంలో కొత్త కుర్చీలు, టేబుళ్లను ఏర్పాటు చేయాలన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955